# మనిషి - మనీషి

డాక్టర్ నీలవేణి డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లడానికి బయల్దేరింది. నర్స్ శ్యామల ఆరోజు ఆపరేషన్ చేయబడిన ఒక పేషంట్ గురించి ఏమో అడుగుతున్నది.

"హల్లో, డాక్టర్" అంటూ లోపలికి వచ్చాడతను. కొంచెం ఆగి, మెల్లగా "నీలవేణీ" అన్నాడు.

నీలవేణి తలపైకెత్తి ప్రశ్నార్థకంగా చూసింది. గుర్తుపట్టింది.

"రాజశేఖరం... డాక్టర్... చాలకాలానికి కనిపించారు... పదిహేనేళ్లు..." ఎన్నో జ్ఞాపకాల నీడలు ఆమె ముఖంలో తారట్లాడాయి. క్షణంలో నిగ్రహించుకుంది. "ఇప్పుడెక్కడున్నారు?" ఆమె స్వరంలో ఏ భావమూ లేదు.

"తెనాలిలో కమలా నర్సింగ్‌హోమ్. ఇద్దరు అసిస్టెంట్స్‌ను పెట్టుకున్నాను... నీవు యిక్కడున్నట్లు నాకు తెలియదు. వచ్చాక తెలిసింది... నాకు చాల సంతోషంగా వుంది" ఏదో సంకోచం అడ్డుపడుతున్నా, ఆమెను చూచిన సంతోషం స్పష్టంగానే కనిపిస్తున్నది.

ఆమెలో తృప్తి రేఖామాత్రంగా కదిలింది. అంతలోనే అసహనం రేగింది. నిలవరించుకున్నది. "పని మీద వచ్చారా?" అన్నది త్రుంచేస్తున్నట్లు.

అతను చిన్నబుచ్చుకున్నాడు. "నా మిసెస్‌కు డెలివరీ టైం. బ్రీచ్. సిజేరియన్ చేయాల్సొంటుంది. బి.పి., ఇడీమా కూడా వున్నై. చాలా బాధపడుతున్నది. నీవు వెంటనే వచ్చి చూడాలి. బిడ్డను ఎట్లయినా సేవ్ చెయ్యాలి... సమయానికి నీవే యిక్కడుండటం నా అదృష్టం" ఆదుర్దాగా గబగబా అన్నాడు.

ఏం మారలేదు అప్పటికీ యిప్పటికీనూ. స్వార్థం తప్ప ఏమీ అర్థం కాదు.

"నేనిక్కడున్నానని చాల సంతోషిస్తున్నట్లున్నారు. నా డ్యూటీ టైం అయిపోయింది ఇంటికెళ్లబోతున్నాను. క్వార్టర్స్‌లో డాక్టర్ సీత వుంటారు. పిలిస్తే చూస్తారు. నేను రేపు సెలవు పెట్టాను" అన్నది.

శేఖరం బాధగా చూశాడు. "నీలవేణీ! నీవున్నావనగానే ఎంతో సంతోషించాను. నీవేనా యిలా మాట్లాడుతున్నావు! పాత స్నేహం, అభిమానం, ప్రేమా అన్నీ మరిచిపోయావా?... ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో... ఇది అర్జంటుగా ఎటెండ్ అవవలసిన

విషయం... గతాన్ని మరిచిపో... క్షమించు... నీ బాధ్యత మరువకు!" అన్నాడు.

బాధ్యత! ఆ మాట ఉచ్చరించడానిక్కూడా అర్హత లేని మనిషి శేఖరం!

గతం మనసులో మెదిలింది. గతాన్ని మరిచిపో. క్షమించు. క్లిష్. మాటలు, మాటలు! ప్రేమ, త్యాగం అంటూ మనిషి నిర్మించాననుకున్న ఆదర్శసౌధాలు - మాటల కోటలు - పేక మేడలు - మురికి గుంటలయ్యాయి. మనిషి ఎక్కడున్నాడు? ఆనందంగా ఆ మురికి గుంటల్లో పొర్లుతున్నాడు! మనిషి మాటల మహళ్లు కట్టడం మొదలెట్టగానే సత్యం నుంచి దూరం అయిపోవడం ప్రారంభమై వుంటుంది. సంకుచిత స్వార్థం ఆ మహళ్లనే మురికిగుంటలుగా మార్చింది. మానవత అనే పన్నీటిని మెచ్చలేనివాడయ్యాడు మనిషి... నీలవేణి మనసు చీకాకుతో నిండిపోయింది.

ఒకప్పుడు తాను యీ శేఖరాన్ని మనిషి అని భ్రమించింది... ఎంత గ్రుడ్డితనం! వయస్సు - సెక్స్ - అదృశ్యశక్తి - తనని గ్రుడ్డిదాన్ని చేసింది. అతనిది అందమైన ఆకారం. అద్దం ముందు కూర్చుని అందం దిద్దుకుంటూ, చూసుకుంటూ, గర్వపడుతూ వుండేవాడు. అతనంటే విపరీతమైన ఆకర్షణ, ఆరాధన తనకు. ప్రాక్టికల్స్‌లో డిసెక్షన్స్‌లో అతని బాచ్‌లో వుండి ఎంత ఆనందించింది! మెడికల్ కాలేజీలో చేరిన ఆర్నెల్లకే అందరి ఎదుట నీలా, నీలా అంటూ సొంతం చేసుకున్నాడు తనను. ఆ చనువు యిష్టంగా, ఆనందంగా అతనికి యిచ్చింది.

"అమ్మాయ్, నీ బుట్టలో నేను పడను. మీ కులం వేరు. అదేగాకుండా లక్ష రూపాయిల కట్నం యిచ్చేవాళ్లనే మా వాళ్లు ఒప్పేది", అన్నపుడూ - 'నేనొక ఆడపిల్లని. నీవొక మగపిల్లాడివి. నీవంటే నాకెంతో యిష్టం. ఈ యిష్టం కంటే విలువైనదీ, నిజమైనదీ, సహజమైనదీ ఏముంటుంది?' అనుకొని నవ్వేసింది. తనకు తెలిసింది అది. తన తండ్రి తన తల్లిని కులాంతర వివాహం చేసుకున్నాడు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చారు. ధనం లేకున్నా తృప్తి పండింది. మనుషుల మధ్యన ఏర్పడే సహజ అనుబంధం విలువ తనకు తెలుసు... శేఖరం మాటలు నిజంగా తోచలేదు. నాలుగేళ్లు తనతో స్నేహంగా ఉన్నాడు. తన మనసులోని అనురాగం అంతా అతని ముందుంచింది. కాలం ఆనందంగా కదిలింది. చివరి సంవత్సరం చదువుతున్నప్పుడు తల్లిదండ్రులు ఎంచిన అందమైన అమ్మాయిని లక్ష రూపాయిల కట్నంతో పెళ్లి చేసుకున్నాడు.

అతని తప్పు లేదు. ముందే చెప్పాడు, అతన్ని మనిషి అనుకొని తానే పొరపడింది. కళ్లు తెరుచుకోగానే సమాజపు నిజస్వరూపం కన్పించింది. ఏరీ మనుషులు ఈ సమాజంలో! కులాలు, మతాలు, ప్రేమలు, త్యాగాలు, ఆదర్శాలు, క్షమలు, బాధ్యతలు - మాటలతో సంపన్నమైపోయింది సమాజం. ఇప్పుడు తాను "ప్రేమించాను, క్షమించాను, మరిచి పోతాను"-అంటే అందరికీ అర్థమౌతుంది. తనకే ఆ మాటలు అర్థం లేని అబద్ధాలుగా అన్పిస్తున్నవి. మనస్సు అంతగా-మన చేతుల్లో వుందా? మాటల్లో పడి మునిగిపోయి, నిజాన్నుంచీ ఎంత దూరం వచ్చేశాడు మనిషి!

ఇంతకూ శేఖరం జరిగినదంతా ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో అంటున్నాడా? గతాన్ని మర్చిపో! అంటున్నాడా? ఇంత చిన్న విషయంలో కూడా స్పష్టత లేదు. ప్రతిదాన్లోంచీ లాభం పొందుదామన్న ప్రాకులాటే.

"ఆ పాత విషయాలకు యిప్పటిదాకా కోపం పెట్టుకునేటంత ప్రాముఖ్యత వుందనుకుంటున్నారా?... డాక్టర్ సీత వస్తారు కదా. నా డ్యూటీ టైం అయిపోయింది. నేనూ మనిషినే, నలభై దగ్గర పడుతున్న మనిషిని" ఆమె స్వరంలో కోపం తొంగిచూచింది.

"నీలవేణీ, యిప్పుడు మీరు ప్రముఖ గైనకాలజిస్ట్. ఇప్పుడు నా అవసరం మీకు లేదు. కాని మీ అవసరం నాకుంది. మీరు ఏమైనా మాట్లాడవచ్చు"

'నీవు' 'మీరు'గా మారటం ఆమెకు నవ్వు తెప్పించింది.

"మీకు అర్థం చేసుకునే శక్తి ఎప్పుడూ తక్కువే, శేఖరం! మీకు హెచ్చుతగ్గులు, అవసరాలు అర్థం అవుతాయి గానీ మనుషులు అర్థం కారు" హేళనగా అని బయటికి నడిచింది.

రాతిబొమ్మలాగా ఏ భావం చూపకుండా నిల్చుని వున్న శ్యామల ఆమె వెనుకనే వెళ్లింది.

'మనుషుల్ని మనుషులుగా చూడలేని బలహీనత నాలోనూ వున్నదా? ఈ సందర్భంలో నేను మనిషిగా స్పందించలేకపోయానా?' నీలవేణిలో సందేహం.

బయట అంబాసిడర్ కారు దగ్గర ఏడేళ్ల పాప బిక్కమొహంతో నిల్చొని వుంది. అంతా శేఖరం పోలిక...

నీలవేణి పాప వైపు నడిచింది.

"మీరు చాల అలసిపోయి వున్నారు" మరో బెడద నెత్తికెత్తుకోవద్దని అన్నట్లు హెచ్చరించింది శ్యామల. ఇక్కడికి వచ్చి వున్న యీ నాలుగు నెలల్లోనే నీలవేణి సామర్థ్యం, మంచితనం అందరి అభిమానానికి పాత్రమైంది.

పాప చుట్టూ చెయ్యి వేసి దగ్గరకు తీసుకుంది నీలవేణి. "అమ్మ లేదని భయంగా వుందామ్మా? మీ అమ్మ తొందరగా వచ్చేస్తుందిలే... ఏం చదువుతున్నావ్?"

"థర్డ్ స్టాండర్డ్"

రాజశేఖరం నవ్వుతూ వచ్చాడు. అతని ముఖంలో సంకోచం మాయమైపోయింది. "మా బేబీ, రాణీ..." అన్నాడు.

"సరే, ఆమెనొకసారి చూచి వెళ్తాను, పదండి" అన్నది నీలవేణి.

కమల పచ్చగా, బొద్దుగా వుంది. నిండు గర్భిణీకి వుండే హుందాతనం ఆమెకు మరింత నిండుదనాన్నిస్తున్నది. అయినా బాధతో, అలసటతో మొహం దీనంగా వుంది.

ఈమె లక్ష రూపాయిలతో ముక్కూ మొహం ఎరగని శేఖరాన్ని కొనుక్కుంది. ఆమె డబ్బు ముందు నా స్నేహం, అభిమానం కొరగాకుండా పోయాయి అనుకుంది నీలవేణి.

కమలకు నొప్పి తెరపి యిచ్చింది.

"డాక్టర్ నీలవేణి... కమల" శేఖరం పరిచయం చేశాడు. కమల అతడి వైపు అర్ధవంతంగా చూస్తూ, "మీతో చదువుకున్నారని చెప్పారే, ఆవిడేనా?" అన్నది.

తన గురించి ఏమేమో కోసేశాడన్నమాట! అనుకుంది నీలవేణి.

చూస్తుండగానే కమల చూపులో దైన్యం పోయి, కించిత్ గర్వం, తిరస్కారం కనిపించాయి.

నీలవేణికి కోపమూ, నవ్వూ కూడా వచ్చాయి. మధ్యతరగతి మానసపు విన్యాసం తలచుకుంది. నేను వెళ్ళిపోగానే 'ఈ ఆపరేషన్‌లో నాకేమైనా అయితే ఆవిణ్ణి మాత్రం పెళ్ళాడవద్దు' అనో, 'నేను ఎలాగూ వుండను, తర్వాత ఆవిణ్ణే చేసుకోండి' అనో ఏదో ఒక ఒట్టేయించుకుంటుంది సినిమా ఫక్కీలో!

కమలను పరీక్ష చేసిన నీలవేణి శ్యామలతో "డాక్టర్ సీతను పిలిపించు. థియేటర్ రెడీ చెయ్యమను. నేను యింకో గంటలో వస్తాను" అన్నది.

నీలవేణి వెంట బయటికెళ్ళాడు శేఖరం. "నీవు నాకు చేస్తున్న సహాయానికి చాలా కృతజ్ఞుణ్ణి. నీలా! నీ స్వభావం నాకు తెలీదా! నీవంటి రత్నాన్ని ఎలా జారవిడుచుకున్నానో నాకు అర్థం కావడం లేదు..." అన్నాడు మెల్లగా, ఆర్ద్రంగా.

నీలవేణి జాలిగా నవ్వింది. "మీలాంటివాళ్ళు రత్నాల్ని జారవిడుచుకుంటూనే వుంటారు - అప్పుడూ, యిప్పుడూ, ఎప్పుడూను. రత్నం అంటే ఖరీదైన రాయి కాదు. దానికొక సహజమైన మెరుపు వుంటుంది. అది కాంతిని ప్రతిఫలిస్తూ ఉంటుంది. అది దాని గుణం. మీకు అర్థం కాని విషయాలు చాలా వున్నట్లుంది శేఖరంగారూ! అందులో మొదటిది నేను మీకు సహాయం చెయ్యటం లేదు అన్న విషయం. నేను మనిషిని. మనిషిగా నాకు తోచింది చేసుకుంటూ పోతాను, అంతే!" అనేసి వెళ్ళిపోయింది.

పదిహేనేళ్ళుగా అదృశ్యంగా ఆమెను అనుసరిస్తూ వచ్చిన చిన్న బరువు ఆ జాలిలో కరిగి క్షమయై మరుపులోకి వెళ్ళిపోయింది.

★★★